# మనల్ని ముందుకు నడిపించేది – ప్రేమ



ప్రియమైన మిత్రులారా,

ఆధ్యాత్మిక యాత్రలో అనేక దశలను మనం దాటవలసి ఉంది. ప్రతీ దశ యొక్క చివరి స్థితి దాని తదుపరి దశలోకి మనం ప్రవేశించడానికి వీలుగా మనల్ని చక్కగా తయారు చేస్తుంది. నిజం చెప్పాలంటే, ప్రతీ దశ దాని తదుపరి దశకు, మనం విస్తరించడానికి ఒక పునాదిగా పనిచేస్తుంది. మరో విధంగా చెప్పాలంటే, ప్రతీ దశ ఒక 'కారణం'గా పని చేస్తూ దాని తర్వాత దశను 'ప్రభావం' గా మనకు అందిస్తుంది. మరల ఈ ప్రభావం దాని తర్వాత కలగబోయే ప్రభావానికి 'కారణం' అవుతుంది. ఈ ప్రభావం దాని తర్వాత దానికి కారణం. అలా ఈ కారణ–ప్రభావ పరంపర కొనసాగుతూ ఉంటుంది.

ఈ కారణ–ప్రభావ పరంపర ఒకే దిశలో కదలడమే గాక ప్రతీ ప్రభావం దాని ముందున్న కారణం యొక్క అస్థిత్వానికి హేతువు అవుతుంది. మన ఆధ్యాత్మిక ప్రయాణంలో ఇది ఎలా కొనసాగుతుందో చూద్దాం.

*ప్రతీ దశ ఒక 'కారణం'గా పని చేస్తూ దాని తర్వాత దశను 'ప్రభావం' గా మనకు అందిస్తుంది.*

మనం ఆధ్యాత్మిక జీవితాన్ని ప్రారంభించినపుడు, మన దైనందిన జీవితంలో ఎదురయ్యే అనేక ఒడిదుడుకులు, భావోద్వేగాలు, ఆందోళనల వలన హృదయం మనస్సు అవిశ్రాంతంగా ఉండడం గమనిస్తాం. ఇలాంటి అంతరంగ అలజడుల మధ్య మనం సంతోషంగా ఉండగలమా? ఒకవేళ ఏదో ఒక సమయంలో అలా ఉన్నప్పటికీ, ఒక నకారాత్మకమైన భావోద్వేగానికి లోనైనా

లేదా బాహ్యపరిస్థితులకు ప్రతిచర్యాత్మకంగా మనం స్పందించినా, తక్షణమే ఈ సంతోషం గాలికి ఎగిరిపోయే దూదిపింజలా మననుండి దూరమౌతుంది. అంటే అది తాత్కాలికమే.

ఈ సందర్భంలో, కారణ–ప్రభావ సంబంధం చివరకు ఒక జటిలమైన సమస్యల వలలో మనలను చిక్కుకునేలా చేస్తుంది. ఉదాహరణకు ఒక అందమైన గులాబీపువ్వును మనం ఇష్టపడినపుడు ఏమి జరుగగలదో మనకు తెలుసు. ముందుగా, ఆ గులాబీపువ్వును చూసి దాని అందాన్ని మెచ్చుకుంటాం. తర్వాత దానికి దగ్గరగా వెళ్ళినపుడు దాని పరిమళాన్ని ఆస్వాదిస్తాం, చివరకు ఎంతగా దాన్ని మోహిస్తామంటే దానిని మన స్వంతం చేసుకోవాలనుకుంటాం.

*కారణ–ప్రభావ సంబంధం చివరకు ఒక జటిలమైన సమస్యల వలలో మనలను చిక్కుకునేలా చేస్తుంది.*

అడవిలో ప్రశాంతంగా తపస్సు చేసుకునే ఒక యోగి పుంగవునికి సంబంధించిన అద్భుతమైన కథ ఈ సందర్భంలో చెప్పుకోవచ్చు. ఆయనకు ఎటువంటి ఇబ్బందులూ లేవు. దగ్గరలోని గ్రామస్థులు చేత ఆయన చాలా గౌరవింపబడేవారు. ఆయనకు తన కౌపీనం గురించిన బెంగ మాత్రమే ఉండేది. రోజూ రాత్రిపూట దాన్ని ఉతికి చెట్టుకొమ్మకు వ్రేలాడదీసి ఆరబెట్టుకునేవాడు. ఒక రోజు కొన్ని చిట్టెలుకలు ఆ కౌపీనం కొరికి ముక్కలు చేయడం మొదలు పెట్టాయి. అలా రోజురోజుకీ ఆ కౌపీనం మరీ చిన్నదై పోతున్నది. కాబట్టి వాటిని వదిలించుకోవడానికి గ్రామస్థులు ఒక పిల్లిని ఆ యోగికి ఇచ్చారు. మరి పిల్లిని పోషించడానికి పాలు కావాలి కదా! కాబట్టి ప్రతీరోజు సాయంత్రం ఆ గ్రామం నుండి ఒకరు పాలు తెచ్చి పిల్లికి పోసేవారు. చివరకు ఒక రోజు – ఇలా ప్రతీ రోజు సాయంత్రం పూట పిల్లికి పాలుపోసి తిరిగి గ్రామానికి చేరుకునేటప్పుడు, ప్రమాదం బారిన పడేకన్నా మీకొక ఆవును ఇస్తాం, అని గ్రామస్థులు ఒక ఆవును కూడ ఇచ్చారు.

ఇప్పుడు ఆ ఆవు నుండి పాలు పితకాలి, కౌపీనం కొరికి చింపుతున్న ఎలుకలను పట్టుకోడానికి తెచ్చిన పిల్లికి పాలు పోయాలి. కాబట్టి, ఆవు పాలు పితకడానికి ఆ గ్రామస్థులు ఒక పరిచారికను కూడా ఆ యోగి వద్దకు పంపారు. అతడు ఆ అమ్మాయి ప్రేమలో పడి, చివరకు ఆమెతో సాంసారిక బంధాన్ని పెంచుకున్నాడు. అనేక ప్రతిచర్యలు జరగడానికి ఒక చిన్నకారణం చాలు. ఇది కారణ–ప్రభావ సంబంధం గురించి వివరించే ఒక చక్కటి కథ !

ప్రత్యేకంగా మనం కోరుకున్నది ఏదైనా సరే, అది నెరవేరినా నెరవేరకపోయినా, దాన్ని సాధించగలమా లేదా అన్న విషయాలతో పట్టింపులేకుండా, ఆ 'కోరిక' ఒక బీజరూపంలో మనలో ఉండిపోతుంది. అలా మన హృదయంలో ఉన్నంత కాలమూ మొలకెత్తే అవకాశం కోసం అది ఎదురుచూస్తూ ఉంటుంది. అనేక జన్మల పర్యంతము అది అలాగే పాతుకు పోయిన స్థితిలో ఉండగలదు.

మన జీవితాల్లో సంతోషాన్ని, ప్రశాంతతను కలిగించగల కారణాలకు సంబంధించి మన స్వీయ ఆలోచనలు ఎన్నో మనకు ఉన్నాయి. అది మరి పెద్ద జాబితాయే. మంచి స్థాయి, కుటుంబ సభ్యులు, స్నేహితులతో మంచి సంబంధబాంధవ్యాలు, గొప్ప ఉద్యోగం, అందమైన ఇల్లు, సంతోషాన్ని పంచే పిల్లలు ఇలా ఎన్నో ఊహలు. అయితే వీటివల్ల కలిగే ప్రశాంతత పరిమితులకు లోబడి ఉంటుంది. ఇది బాగా సాగుతున్న బాహ్య పరిస్థితులపై ఆధారపడిన ప్రశాంతత. అంటే, ఆ పరిస్థితులు అనుకూలంగా ఉండి నడిపించినంతవరకు మాత్రమే అది నిలిచి ఉంటుంది. అది మనలను ఉన్నతంగా తీర్చిదిద్దదు, పైగా మరింతగా ఆ పరిస్థితుల వలలో మనం చిక్కుకు పోయేలా చేస్తుంది. ఈ విధంగా మనం 'సంస్కారాలను' ఏర్పరచుకుంటాం. ఇదే మన భవిష్యత్ 'కర్మ' ను కూడా నిర్ణయిస్తుంది. ఇటువంటి కారణ–ప్రభావ సంబంధంతో కూడిన ఈ పథం మరిన్ని బంధనాలలో మనం చిక్కుకు పోయేలా చేస్తుంది.

ఆధ్యాత్మికంలో సంక్లిష్టమైన ఈ చిక్కువలనుండి బయటపడి పరిమితులు లేని ప్రశాంతతను శాశ్వతంగా సాధించడానికి ఆకాంక్షిస్తూ, మన ప్రయాణంలో మరింత ఉన్నత స్థితికి చేరుకోవాలనుకుంటాం. మరి మన వికాసానికి తోడ్పడే ఈ కారణ–ప్రభావ సంబంధాన్ని ఎలా ఏర్పరచుకోగలం?

*ఆధ్యాత్మికంలో సంక్లిష్టమైన ఈ చిక్కువల నుండి బయటపడి పరిమితులు లేని ప్రశాంతతను శాశ్వతంగా సాధించడానికి ఆకాంక్షిస్తూ, మన ప్రయాణంలో మరింత ఉన్నత స్థితికి చేరుకోవాలనుకుంటాం.*

సంక్షోభానికి గురై అశాంతితో ఉన్న మనస్సును, హృదయాన్ని నిశ్చలపరచడమే మొదటిమెట్టు. దీని ఫలితంగా అంతర్గత ప్రశాంతత ఏర్పడుతుంది. కాబట్టి మన యాత్రలో మొదటి దశ ముగింపు, శాంతి. ఎప్పుడైతే అంతరంగంలో నిజమైన ప్రశాంతతతో, సంతృప్తితో మనం ఉండగలుగుతామో అపుడు బాహ్య పరిస్థితులలో ఏమి జరుగుతున్నా సరే మనం అదే ప్రశాంతచిత్తంతో ఉంటాం. అటువంటి ప్రశాంతమైన మానసిక స్థితిని అన్నివేళలా హార్ట్‌ఫుల్‌నెస్ సాధనా విధానం మనకు కలుగజేస్తుంది. దీని తదుపరి దశ అప్పుడు ప్రారంభమవుతుంది. కేవలం ఈ అంతరంగ ప్రశాంతత ఉంటే సరిపోతుందా? సరిపోదు. ఎందుకంటే సామరస్యపూరకమైన మన అంతరంగ ప్రశాంత స్థితిని మాటలు, చేతలు, ప్రవర్తనలో

*అటువంటి ప్రశాంతమైన మానసిక స్థితిని అన్నివేళలా హార్ట్‌ఫుల్‌నెస్ సాధనా విధానం మనకు కలుగజేస్తుంది.*

బాహ్యంగా వ్యక్తపరచడం కోసం ఇది ముందుగా కావాలి. మన అంతరంగ సామరస్యం బాహ్య ప్రవర్తనలో ప్రతిబింబించాలి. అపుడు, గులాబీపూవు తన పరిమళాన్ని వెదజల్లినట్లుగా మనం కూడా మన అంతరంగ ప్రశాంతతను బయటకు ప్రసరింపజేస్తాం. అప్పుడే మనం ఆలోచించేది, చెప్పేది, చేసేదీ అంతా ఈ ప్రశాంతతను ప్రసరింపజేస్తుంది.

ఇటువంటి ప్రశాంత చిత్తం మనలను తదుపరి స్థితికి తయారుచేస్తుంది. అది మరింత శుద్ధమైన ఉన్నత దశ. ఈ దశలో అప్పుడప్పుడు ధ్యాన సమయంలో మనం 'సమాధి' స్థితిని అనుభవించడం ఆరంభిస్తాం. సమాధి అంటే ఏమిటి? సరళమైన భాషలో 'సమాధి' అంటే 'సృష్టికి పూర్వమున్న స్థితి'. పరిపూర్ణమైన సమతుల్యస్థితి. సాధన కొనసాగించే కొద్దీ క్రమక్రమంగా అటువంటి పరిపూర్ణస్థితిని తరచుగా, ఎక్కువ సమయం నిలిపి ఉంచడం మనకు అభ్యాసం అవుతుంది. చివరకు అదే ఒక శాశ్వత స్థితిగా మారిపోతుంది.

ఎంతగానో పొందగోరే స్థితి 'సమాధి' కాగా, మనం మార్గంలో ప్రయాణిస్తుండగా ఈ సమాధి స్థితి మారుతూ ఉంటుంది. ఇందులో వివిధ స్థాయిలు ఉన్నాయి. అన్ని స్థాయిలలోనూ 'లీనమవడం' అనే ఒకే లక్షణం ఉన్నప్పటికీ అది విభిన్న చైతన్య స్థాయిలకు చెందినదై ఉంటుంది. మొదటిది మనం ఏమీ అనుభూతి చెందని పాషాణ తుల్య చైతన్యస్థాయి. మనలో ఏమి జరుగుతున్నదో కూడా తెలుసుకోలేము. ఎందుకంటే అది మన ఎరుకకు అందని మనస్సులోని ప్రదేశాలకు మన ప్రయాణం. ఇటువంటి సమాధి స్థితి నుండి బయటకి వచ్చినపుడు మాత్రమే మనం అలాంటి యాత్ర కొనసాగించామని అనుభూతి చెందగలుగుతాం. ఇక రెండవ స్థాయిలో, 'స్వప్నం' లాంటి ఒక విధమైన చైతన్యంలో ఉంటాం. ప్రాణాహుతిప్రసారం వల్ల సూక్ష్మాతి సూక్ష్మమైన స్థాయిలకు అతివేగంగా చేరుకొని మరింత ఉన్నతమైన సమాధి స్థితులను అనుభూతి చెందుతాం.

*సమాధి అంటే ఏమిటి? సరళమైన భాషలో 'సమాధి' అంటే 'సృష్టికి పూర్వమున్న స్థితి' పరిపూర్ణమైన సమతుల్యస్థితి.*

ఇక మూడవస్థాయిలో, తర్వాత స్థితి, ఒకవైపు పూర్తిగా లీనమై ఉన్నప్పటికీ మనకంతా తెలుస్తూ ఉంటుంది. దీన్ని'సహజసమాధి' అంటారు. అంటే ప్రకృతి సిద్ధమైన సమాధి స్థితి అని అర్థం. ఈ స్థితిలో మనం ధ్యానంలో లోతుగా నిమగ్నమై పోతాము, అదే సమయంలో బయట జరిగే విషయాలన్నీ మన పూర్తి ఎరుకలో ఉంటాయి.మనం నిజ స్థితితో అనుసంధానమై ఉంటాం. దీనినే తురియ స్థితి అని కూడా అంటారు. చైతన్యం యొక్క నాల్గవస్థితి ఇదే. ఇక్కడ ప్రతీది మన ఎరుకలో ఉంటుంది.

ఇంకా ముందుకు సాగితే, మన రోజువారీ కార్యకలాపాలలో మనం ఎంత నిమగ్నమై ఉన్నప్పటికీ ధ్యానించే స్థితిని పెంపొందించుకుని దాన్ని అలా రోజంతా కొనసాగించవచ్చు. అపుడు ఏకకాలంలో మనం చేసే పనుల మీద, పరిసరాల మీద, టీవీమీద, బయట జరిగే విషయాల మీద, మన గుండా జరిగే ప్రాణాహుతి ప్రసారం మీద, మన అంతరంగంలోని యదార్థస్థితి మీద, మన వ్యవస్థలోకి ఇంకా ప్రవేశించబోయే విషయాల మీద,

*సమాధి స్థితిలో మనం ధ్యానంలో లోతుగా నిమగ్నమై పోతాము, అదే సమయంలో బయట జరిగే విషయాలన్నీ మన పూర్తి ఎరుకలో ఉంటాయి.మనం నిజ స్థితితో అనుసంధానమై ఉంటాం.*

మనలో పుట్టుకు వస్తున్న ఆలోచనల మీద, మనం తీసుకోబోయే తదుపరి చర్యల మీద దృష్టిని నిలపడమే కాకుండా ఎల్లప్పుడూ మన అంతరంగ ఆధ్యాత్మిక స్థితితో అనుసంధానమై ఉండగలం. పై విషయాలన్నింటినీ గమనిస్తూ మనం ప్రశాంతంగానే ఉంటాం. మన రోజువారీ కార్యకలాపాలు జరుగుతున్నప్పటికీ ఈ 'సమాధి' స్థితి అవిచ్ఛిన్నంగా కొనసాగుతూ ఉంటుంది.

అపుడు 'లయం' అవడమనే మరో ఆధ్యాత్మిక స్థితికి మనం అర్హతను పొందుతాం. ఈవిధంగా లయమవడంమొదలవగానే, 'తురియాతీత్ అనే స్థితిని సృష్టిస్తుంది. ఈ తురియాతీత్ స్థితిలో కళ్ళు తెరుచుకునే మనం మూడువందలఅరవై డిగ్రీల సంపూర్ణ చైతన్యం కలిగియుంటాం. ప్రత్యేకంగా దేని మీద దృష్టిని నిలిపి ఉంచనవసరం లేదు. ఎందుకంటే, ఏదైనా ఒక విషయం గురించి ప్రత్యేకంగా దృష్టిని నిలిపినట్లైతే అది ఇక ఎంతమాత్రం ధ్యాన స్థితి కాదు. ఏకాగ్రత మాత్రమే అవుతుంది.

పరిపూర్ణ సమతుల్య స్థితిని మనలో సాధించనంత వరకూ జీవితంలో ఏ పనిచేసినా మనకు ఏదో ఒక వెలితి కనిపిస్తూనే ఉంటుంది. ఎప్పుడైతే మన భౌతిక, ఆధ్యాత్మిక కార్యకలాపాలలో అటువంటి సమతుల్య స్థితిని సాధిస్తామో అపుడు మనం చేసే పనులలో విజయం సిద్ధించినా సిద్ధించకపోయినా నిజమైన ఆనంద స్థితి దానికదే వస్తుంది.

పైన చెప్పుకున్న వివి ధదశల్లో, 'అహం' ప్రముఖ పాత్ర పోషిస్తుంది. అంతా 'నేను' అనే విషయం చుట్టూ తిరుగుతూ ఉంటుంది. ముందుగా 'నా' సమస్యలు, ధ్యానంలో 'నాకు' కలిగే అనుభవాలు, ఆ తర్వాత 'నా' ఆనందము, ప్రశాంత స్థితులు మొదలైనవి. ఏదీ మన చైతన్యం నుండి తప్పించుకోలేని అతిసూక్ష్మస్థాయిలో తప్ప, ఉన్నత స్థితులకు వెళ్లే కొద్దీ క్రమంగా ఈ 'నేను' అనేది మరుగునబడి, చివరకు దాని అస్థిత్వానికి కోల్పోతుంది. అయినప్పటికీ దేని మీదా మనం ఏకాగ్రత చూపము. అదే 'విలీనమవ్వడం' అంటే. అపుడు మన స్వీయఎరుక ఉండదు. అదే సన్నిధి.

*ఈ విధంగా లయమవడం మొదలవగానే, తురియాతీత్ అనే స్థితిని సృష్టిస్తుంది. ఈ తురియాతీత్ స్థితిలో కళ్ళు తెరుచుకునే మనం మూడువందలఅరవై డిగ్రీల సంపూర్ణ చైతన్యం కలిగియుంటాం.*

ఒక దశ నుండి మరో దశకి ప్రయాణించడాన్ని, అంతరిక్షంలోకి ప్రయోగించే ఉపగ్రహంతో సరిపోల్చవచ్చు. ఉపరితల ప్రయోగవాహనం నుండి, ఉపగ్రహాన్ని ప్రయోగించడం కోసం ముందుగా కొన్ని నిమిషాలపాటు ఎక్కువ మోతాదులో ఇంధనాన్ని మండించి శక్తిని సృష్టిస్తారు. ఈ శక్తితో ఉపగ్రహానికి కావలసిన వేగాన్ని అందుకునేలా చేసి భూమ్యాకర్షణశక్తి నుండి ఉపగ్రహాన్ని తప్పించి భూవాతావరణాన్ని దాటించేలా చేస్తారు. కొన్ని గంటలు గడచిన తర్వాత ఉపగ్రహం రాకెట్టునుండి విడివడి నిర్దేశించిన కక్ష్యలో తనకు తానుగా ముందుకు వెళుతుంది. దీని తర్వాత ఇక ఎటువంటి శక్తి అవసరంలేదు.

మన యాత్రలో, ఉన్నతోన్నత ఆధ్యాత్మిక స్థాయిలకు మనలను తీసుకువెళ్ళడానికి ఇలాంటి పీడనం అవసరం. నిరంతరం పరిశుద్ధం అవుతున్న ప్రేమ ద్వారానే ఇది సాధ్యపడుతుంది. అపుడు మనలోఒక ప్రశ్న తలెత్తుతుంది.ఎన్నో ఒడిదుడుకుల మధ్య సాగే మన యాత్ర పర్యంతం ఇదే ప్రేమతత్వంలో మనమెలా మునిగి ఉండగలం? దీనికి సమాధానం కోసం మనం మన ఆధ్యాత్మిక పునాది అడుగడుగునా ఎలా నిర్మించబడిందో ఒకసారి పునరాలోచించుకోవాలి. మన యాత్ర మొదలైన మొదటి దశలో ఎటువంటి పరిమితులు లేని నిజమైన సంతోషాన్ని, ప్రశాంతతను స్థిరపరచుకుంటాం. దీని ప్రభావంవల్ల మనలోని ప్రేమ కూడా ఎటువంటి బాహ్య చిత్త భ్రమలకు ఇక ఏమాత్రమూ ఊగిసలాడదు.

*ఏదీ మన చైతన్యంనుండి తప్పించుకోలేని అతిసూక్ష్మ స్థాయిలో తప్ప, ఉన్నత స్థితులకు వెళ్లే కొద్దీ క్రమంగా ఈ 'నేను' అనేది మరుగునబడి, చివరకు దాని అస్థిత్వాన్నికోల్పోతుంది. అయినప్పటికీ దేనిమీదా మనం ఏకాగ్రత చూపము.అదే 'విలీనమవ్వడం' అంటే. అపుడు మన స్వీయఎరుక ఉండదు. అదే సన్నిధి.*

అయితే అంతరంగంలోని మార్పులు ఈ ప్రేమ మీద ఎటువంటి ప్రభావాన్ని చూపిస్తాయి? మన ఆంతరంగిక యాత్ర అనుక్షణానికి మారుతూ ఉంటుంది, ఇటువంటి మార్పులు అప్పుడప్పుడు అంతరంగ సంక్షోభాన్ని సృష్టిస్తాయి. కాబట్టి అంతరంగ మార్పులకు కూడా చెదరనటువంటి స్థాయికి ఈ ప్రేమ వికసించాలి. మన అనుభవంలో ఇది ఎలా వ్యక్తమౌతుంది? మొదట్లో మనం ఆనందం కోసం, గొప్ప అంతరంగ అనుభవాల కోసం ఆశపడతాం, కానీ కాలం గడిచే కొద్దీ ప్రేమంటే ఆనందం కాదనీ, సమాధి అంటే ఆ ఆనందంలో మైమరచేది కాదన్న వాస్తవమూ మనకు తెలిసివస్తుంది. శాంతిలాగే ఈ ప్రేమకు కూడా అనుభవంలో షరతులుండవు.

*మన యాత్రలో, ఉన్నతోన్నత ఆధ్యాత్మిక స్థాయిలకు మనలను తీసుకువెళ్ళడానికి ఇలాంటి పీడనం అవసరం. నిరంతరం పరిశుద్ధం అవుతున్న ప్రేమ ద్వారానే ఇది సాధ్యపడుతుంది.*

వివిధ దశల్లో ప్రకటితమయ్యే అంశాలను సంక్షిప్తంగాచెప్పుకుందాం:

అంతరంగ మానసిక అశాంతితో మొదలుపెట్టి, సకారాత్మక ధోరణితో అంతరంగ ప్రశాంతతకోసం ముందుకుసాగుతాం మన.

అలా ఏర్పడిన అంతరంగ ప్రశాంతతను వెలుపలకుకూడా విస్తరింపజేసి ప్రతీ విషయంలోనూ ఆ స్థితిని ప్రతిబింబిస్తాము.

అలా కొనసాగేటపుడు కొన్నిసార్లు 'సమాధి' స్థితిని అనుభవించడం మొదలుపెడతాం, తరువాత తరచుగానూ, చివరకు శాశ్వతంగానూ దీన్ని అనుభవిస్తాం.

ఈ సమాధిస్థితి కూడా అనేక దశలగుండా సాగుతుంది. పాషాణతుల్య సమాధి నుండి స్వప్నసమాధికి, అక్కడినుండి చైతన్య సమాధి దిశగా, ఈ దశలన్నింటిలోనూ ధ్యానంలో మన అంతర్గతదృష్టి, లీనం కావడం స్థిరంగా కలిగిఉంటాం. అదే 'తురియ' స్థితి.

అప్పుడు, ఇటువంటి తురీయ స్థితిని అన్ని పరిస్థితులలోనూ అంటే జాగృత, స్వప్నావస్థలలోనూ కలిగి ఉండటాన్ని 'తురియాతీత్' స్థితి అంటారు. ఇటువంటి స్థితిలో మనం అన్నింటిలో లీనమై పోయినప్పటికీ, అన్నీ మన ఎరుకలోఉంటాయి.

దీన్ని ఇలా కొనసాగించడం ద్వారా, మనం నిజమైన లయావస్థకు అర్హులమవుతాము.

ఆసక్తికరమైన విషయం ఏమంటే, ఒక దశనుండి మరో దశకు మనలను నడిపించే అంశాలు అన్ని దశలలోనూ ఒకే విధంగా ఉంటాయి. అవి – తదేకమైన దృష్టి, సాధన, తీవ్రమైన ఆసక్తి, పవిత్రత, వినమ్రత, గురువుపట్ల శరణాగతిభావం– వీటన్నింటికీ 'ప్రేమ' ఆధారమై ఉండాలి.ఒక విధంగా ఇది ఒక వృక్షం యొక్క పెరుగుదల లాంటిదే. విత్తనానికి నీరు కావాలి, మొలకెత్తే సమయంలోనూ అదే నీరు కావాలి, చిన్న మొక్కగా ఉన్నప్పుడూ అదే నీరు కావాలి చివరకు పెద్దవృక్షం అయినపుడూ అదే నీరు కావాలి.

*ఒక దశనుండి మరో దశకు మనలను నడిపించే అంశాలు అన్ని దశలలోనూ ఒకే విధంగా ఉంటాయి. అవి – తదేకమైన దృష్టి, సాధన, తీవ్రమైన ఆసక్తి, పవిత్రత, వినమ్రత, గురువుపట్ల  శరణాగతిభావం–  వీటన్నింటికీ 'ప్రేమ' ఆధారమై ఉండాలి.*

సారాంశం:

మనలను ముందుకు నడిపించే ఇంధనం 'ప్రేమే'.

కేవలం ప్రేమ ద్వారానే ఈ లయావస్థ త్వరితగతిని పరిపక్వము చెందుతుంది..

ఈ ప్రేమసాగరంలో ప్రేయసి, ప్రియుడూ కేవలం పేరుకు మాత్రమే ఉంటారు. ఇక ప్రియుడూ, ప్రేయసి మరియు ప్రేమ అనే త్రయం ఒక్కటై పోతాయి.

ప్రేమాభిమానాలతో,

కమలేష్ పటేల్
ఏప్రిల్ 30, 2018
కన్హా శాంతివనం

మనలను ముందుకు నడిపించే ఇంధనం 'ప్రేమే'.
కేవలం ప్రేమ ద్వారానే ఈ లయావస్థ త్వరితగతిని పరిపక్వము చెందుతుంది.
ఈ ప్రేమసాగరంలో ప్రేయసి, ప్రియుడూ కేవలం పేరుకు మాత్రమే ఉంటారు. ఇక ప్రియుడూ, ప్రేయసి మరియు ప్రేమ అనే త్రయం ఒక్కటై పోతాయి.